క్లుప్తంగా

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు



కోర్టు ఆవరణలో యువజన కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: అక్రమ అరెస్టులతో ప్రభుత్వం పోరాటాన్ని ఆపలేదని పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు అన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ.. గతంలో పట్టణంలో ధర్నా చేపట్టగా.. పలువురు నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం వారు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంకిత్ అనురాగ్ మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం పోరాటాలు చేస్తూనే ఉంటామని, పోలీసులు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేదిలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే ఆందోళనలు ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాతుల వెంకటయ్య, భీంశంకర్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



విరాళం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం బట్లచందారం గ్రామంలో జరిగిన బొడ్రాయి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఉత్సవాలకు విరాళంగా రూ.21వేయి అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, నాయకులు సలీం, వెంకటేశ్, తిర్మలేశ్, తిరుపతయ్య, వీరప్ప, నాగప్ప పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



సేవాలాల్ మహరాజ్‌కు పూజలు చేస్తున్న కాసాని వీరేశ్ ముదిరాజ్ తదితరులు

దోమ: టీడీపీ హయాంలోనే తండాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం దిర్సంపల్లి తండాలో గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో గిరిజనులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు చంద్రహాస్, పరిగి నియోజకవర్గ నాయకుడు మాణిక్యం, కృష్ణయ్య, సాయిలు, వెంకటేశ్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పని సరిగా రసీదు తీసుకోవాలి



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

పూడూరు: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తులసిరాం చెప్పారు. సోమవారం మంచన్‌పల్లి, పెద్ద ఉమ్మెంతాల్ గ్రామాల్లో ఉన్న ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. డీలర్లు తప్పని సరిగా విత్తనాలకు సంబంధించిన వివరాలను బోర్డులపై డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు అమ్మితే రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని డీలర్లకు చెప్పారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సదాశివుని అలంకారంలో పరమేశ్వరుడు



సదాశివుని అలంకారంలో శివుడు

తాండూరు: భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలోని పరమేశ్వరుడు.. సదాశివుని అలంకారంలో సోమవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు విజయ్‌కుమార్ శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు.

విద్యార్థులకు సమస్యల స్వాగతం

వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలికాయి. నిర్వహణ లోపం వలన చెత్తా చెదారంతో విద్యాలయాలు దర్శనం ఇవ్వగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు వాటిని శుభ్రం చేశారు. మరికొన్ని పాఠశాలలు, ఆవరణలో గ్రామాభివృద్ధికి సంబంధించిన నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచడంతో పిల్లలు బడి ఆవరణలోనే విద్యనభ్యసించారు.

- దుమ్ముధూళితో దర్శనం ఇచ్చిన పాఠశాలలు
- చీపురు చేతబట్టిన టీచర్లు, స్టూడెంట్స్
- బషీరాబాద్‌లో మొదటి రోజే 69 మంది ఉపాధ్యాయుల గైర్హాజరు!





బషీరాబాద్: కొర్విచెడ్‌గనిలో ఆరుబయట కూర్చున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు (ఇన్‌సెట్లో) పాఠశాల ఆవరణలో సీసీరోడ్ల సామగ్రి, కంకర కుప్పలు, కార్మికులు

బషీరాబాద్: వేసవి విరామం తరువాత తెరుచుకున్న ప్రభుత్వ పాఠశాలలు.. దుమ్ముధూళి పట్టి విద్యార్థులకు స్వాగతం పలికాయి. ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో పలకాబలపం పట్టాల్సిన చిట్టి చేతులు.. చీపురు చేతబట్టి బడులను శుభ్రం చేశాయి. స్కూల్స్ ప్రారంభానికి ముందే పారిశుద్ధ్య పనులతో పాటు ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా సోమవారం హాజరు కావాలని విద్యాధికారులు ముందే చెప్పినా.. నిర్వాహకులు కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేయించలేక పోయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. కొర్విచెడ్ గని పాఠశాల తరగతి గదుల్లో సీసీరోడ్లకు సంబంధించిన సామగ్రి, ఆవరణలో కంకర, ఇసుక కుప్పలు, వాహనాలు నిలపడంతో విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. గ్రామంలో జరుగుతున్న సీసీరోడ్ల నిర్మాణ సామగ్రిని అదే గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తమకు సమాచారం ఇవ్వకుండానే ఇక్కడ నిల్వ ఉంచారని హెచ్ఎం భీమయ్య తెలిపారు. ఇలాంటివి జిల్లాలో చాలాచోట్ల జరిగినట్లు తెలుస్తోంది.

69 మంది ఉపాధ్యాయుల దుమ్మా

బషీరాబాద్ మండలంలో 62 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 53 పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ఉంది. ఇందులో 243 మంది బయోమెట్రిక్ మార్క్‌డ్ టీచర్లు ఉన్నారు. వీరిలో మొదటి రోజు 69 మంది ఉపాధ్యాయులు గైర్హాజరు అయినట్లు బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా బయటపడింది. కొన్ని తండాలల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆలస్యంగా వచ్చారు. ఇదిలా ఉండగా.. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే.. మండల విద్యావనరుల కేంద్రంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయగా.. ఉపాధ్యాయులు పుస్తకాలకు తీసుకెళ్లారు. బషీరాబాద్ మండలానికి 28 వేల పుస్తకాలు వచ్చాయని, ఇంకా కొన్ని తరగతులకు సంబంధించిన బుక్స్ రావాల్సి ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కొడంగల్ రూరల్: ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా.. చదువుతున్న పాఠశాలల్లోనే పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై.. విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులే స్కావెంజర్లు!



బడి గదులను శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయులు

దోమ: పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రత కోసం ప్రభుత్వం స్కావెంజర్లను నియమించేది. అయితే గత మూడేళ్ల కాలం నుంచి నిధులు లేవంటూ.. స్కావెంజర్లను తొలగించింది. ఈ బాధ్యతలు జీపీ పారిశుద్ధ్య కార్మికులు చేయాల్సి ఉండగా.. వారు చేయడం లేదు. సోమవారం పాఠశాలలు ప్రారంభం కాగా.. నిర్వహణ లేక పాఠశాలలు చెత్త, చెదారం పేరుకుపోయి దర్శనం ఇచ్చాయి. దాదాపూర్ పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. స్కావెంజర్లు లేకపోవడంతో.. ఉపాధ్యాయులే పాఠశాల పరిసరాలను, దుమ్ముధూళితో నిండిన గదులను శుభ్రం చేశారు.

చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ హరిశ్చందర్

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. దోమ మండల కేంద్రంతో పాటు ఉదన్‌రావుపల్లి పాఠశాలలో సర్పంచ్ రాజిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేసి మాట్లాడారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు ప్రభుత్వం అందజేస్తుందని, చిన్నారుల తల్లితండ్రులు క్రమం తప్పకుండా పిల్లలను బడికి పంపిచాలని కోరారు.

రేపు నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

మోమిన్‌పేట: శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుందని సర్పంచ్ అంగేరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడారు. మోమిన్‌పేట గ్రామంలో ఉదయం 8గంటలకు దీపారాధన, గణపతిపూజ, పుణ్యవచనం, అంకురార్పణం, మండపారాధన, కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అనంతరం ధాన్యాధివాసం, జలాధివాసం, ఫల పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

కొడంగల్ రూరల్: మంగళవారం ఉదయం 10-30గంటలకు పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న మహిళా సంక్షేమ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలను, మహిళా ఉద్యోగులను ఆయన సన్మానించనున్నారని, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్

బంట్వారం: ప్రజావాణిలో సోమవారం ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. బంట్వారం, కోట్‌పల్లి రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ ధరణి సమస్యలపై రైతులకు వివరించారు. అవసరమైన రైతులు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

- బాల్యం మధురమైనది
- చిన్నారులతో పనిచేయించడం నేరం
- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి
- ముస్లింలకు హజ్ తోఫా పంపిణీ



యాత్రికులకు హజ్ తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. సోమవారం ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో హజ్ యాత్రకు వెళ్లనున్న 30 ముస్లిం కుటుంబాలకు లగేజీ బ్యాగులను హజ్ తోఫా రూపంలో అందజేసి మాట్లాడారు. అన్ని వర్గాల వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని, పేద ముస్లింల ఇళ్లల్లో పెళ్లిళ్లు జరిగితే.. షాదీ ముబారక్ పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని చెప్పారు. ప్రతి ముస్లిం చిన్నారి విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడు సయ్యద్ కమాల్ అతర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే..

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని, చిన్నారులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బాల్యం ఎంతో మధురమైనదని, ముక్కుపచ్చలారని బాలలతో వెట్టి చాకిరి చేయించడం నేరమన్నారు. బాలలతో పని చేయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ కుమార్, సీఐలు రాజేందర్ రెడ్డి, రాంబాబు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు జ్యోతి, నర్సింహులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: 2కే రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



తాండూరులో పరుగెడుతున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పోలీసుశాఖ పనితీరు భేష్
- రాష్ట్రంలో కొలువుదీరుతున్న పరిశ్రమలు
- 2కే రన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు
- పరుగు పందెంలో పాల్గొన్న సకల జనులు

కొడంగల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నడక, పరుగు, యోగాతోనే సాధ్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌ను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి జీవనం యాంత్రికంగా మారిందని, ప్రతి రోజు ఉదయం పూట కొంత దూరం నడిస్తే ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పట్టణ శివారులోని ఎన్కేపల్లి క్రాస్‌రోడ్డు వరకు.. అక్కడి నుంచి అంబేడ్కర్‌చౌరస్తా వరకు నిర్వహించిన 2కే పరుగులో ఎమ్మెల్యేతో పాటు పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ ప్రత్యేకాధికారి కృష్ణన్, పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు రవిగౌడ్, శంకర్, రమేష్‌కుమార్, కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ బాకారం అరుణ్‌కుమార్, సీడీపీఓ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు ఎనలేవి

తాండూరు: నడకతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం వ్యాయామం చేయాలని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు అందిస్తున్న సేవలు ఎనలేనివని, వారి పనితీరుతో రాష్ట్రం శాంతిభద్రతలో ప్రశాంతంగా ఉందని, ఫలితంగా రాష్ట్రంలో పరిశ్రమలు కొలువుదీరుతున్నాయని చెప్పారు. రెవెన్యూ, మున్సిపల్ శాఖల పనితీరు చాలా మెరుగైందన్నారు. ప్రభుత్వం తెచ్చిన పోర్టల్స్‌తో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ వారి మెప్పు పొందుతున్నారన్నారు. అనంతరం రన్‌లో విజేతలైన వారికి ఎమ్మెల్యే జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్ కుమార్, పట్టణ, రూరల్ సీఐలు రాజేందర్ రెడ్డి, రాంబాబు, పలువురు ఎస్సైలు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, కౌన్సిలర్లు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ



పెద్దేముల్: జూనియర్ కళాశాల వద్ద హాల్ టికెట్ నంబర్ చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

పెద్దేముల్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 781 మంది విద్యార్థులు ఉండగా.. ప్రథమ సంవత్సరం 623, ద్వితీయ సంవత్సరం 158 మంది పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం ప్రథమ సంవత్సరం తెలుగు, హిందీ పరీక్షకు 40 మంది హాజరు కావాల్సి ఉండగా.. 32 మందే వచ్చారని, 8 మంది గైర్హాజర్ అయ్యారని, ద్వితీయ సంవత్సంలో 8మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఐదుగురు హాజరై.. ముగ్గురు గైర్హాజర్ అయినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అన్వర్ తెలిపారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, హిందీ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఫస్టియర్ పరీక్షలకు ఒక విద్యార్థి, సెకండ్ ఇయర్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ముదిరాజ్‌లకు బీసీబంధు ఇవ్వాలి



యాలాల: తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజులు

యాలాల: దళితబంధు పథకం లాగే ముదిరాజ్‌లకు బీసీబంధు ఇవ్వాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష వరకు రుణాలు ప్రకటించిందని, ఆ జాబితాలో ముదిరాజ్‌లకు చోటు కల్పించలేదని వాపోయారు. రాష్ట్రంలో ఎక్కువగా ముదిరాజ్‌లు ఉన్నప్పటికీ తమకు తగిన గుర్తింపు దక్కకపోడం నిరాశ కలిగించిందన్నారు. దళితబంధు పథకం ద్వారా దళితులకు రూ.10 లక్షలు ఇచ్చినట్లుగా.. ముదిరాజ్‌లకు కూడా బీసీబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు సాయిలు, అశోక్, ప్రవీణ్‌కుమార్, అమృతప్ప ఉన్నారు.

వెయ్యి కోట్లతో..

మోమిన్‌పేట: రూ.వెయ్యి కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాని ముదిరాజ్ చైతన్య వేదిక కన్వీనర్ మన్నె బ్రహ్మం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తూ.. ముదిరాజ్, వాల్మీకి కులాలను విస్మరించారని వాపోయారు. బీసీలలో అత్యధికంగా ముదిరాజ్ కులాల వారే ఉన్నా.. ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పించడం లేదని ఆరోపించారు. బీసీలో ఉన్న ప్రతి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

అణుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

మర్పల్లి: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు అణుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం మండల ఉపాధ్యక్షుడు సలీం, వర్కింగ్ ప్రసిడెంట్లు రఫీ, రాచన్న, సీనియర్ నాయకులు మల్లేశ్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మూడు రోజుల క్రితం ఘణపురానికి చెందిన ఎండీ రహీం అనే బీఆర్ఎస్ కార్యకర్త.. ప్రసాద్‌కుమార్‌పై సోషల్ మీడియాలో అణుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ప్రసాద్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నారని, వికారాబాద్ నుంచి కాంగ్రెస్ టిక్కెట్ ఆయనకు ఇవ్వడం లేదని, నామినేటెడ్ పదవి ఇచ్చే విధంగా పార్టీ పెద్దలు ఆలోచనలో ఉన్నారని ఇలా పలు రకాల ఆరోపణలు చేస్తూ ప్రచారం చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇక ముందు ఆయనపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం రహీంపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అరకొర పుస్తకాలే

పెద్దేముల్: పాఠశాలలు ప్రారంభమైనా పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదు. మండలంలో ప్రాథమిక 45, ఉన్నత 9, యూపీఎస్ 5, కేజీబీ1, మొత్తం 60 పాఠశాలల్లో 5,038 మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పటి వరకు 23,579 పుస్తకాలు మాత్రమే మండల వనరుల కేంద్రానికి వచ్చాయి. వాటిని మండల అధికారులు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేసి, విద్యార్థులకు పంపిణీ చేయిస్తున్నారు. కాగా 1,2,7వ తరగతుల తెలుగు రీడర్స్, 3వ తరగతి సైన్స్, 6వ తరగతి గణితం పుస్తకాలు రావలసి ఉందని మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. ప్రస్తుతం పార్ట్ 1 పుస్తకాలు వచ్చాయని, పార్ట్2 బుక్స్ సెప్టెంబర్ మాసంలో రానున్నట్లు వెల్లడించారు.

సర్కారు బడులకు పంపండి

- చిన్నారుల తల్లిదండ్రులను కోరిన టీచర్లు
- తొలిరోజు అంతంతమాత్రమే హాజరు

కుల్కచర్ల: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచితంగా.. పాఠపుస్తకాలు, ఏకరూప దుస్తులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపండి అని చిన్నారుల తల్లిదండ్రులను మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, సర్పంచ్ సౌమ్యారెడ్డి కోరారు. సోమవారం కుల్కచర్ల, బండవెల్కిచర్ల గ్రామాల్లో విద్యార్థులకు, పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, బండవెల్కిచర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఎంపీటీసీ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

పరుగు పరుగున..

బొంరాస్‌పేట: విద్యా సంవత్సరం ప్రారంభం రోజున బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరుగు పరుగున బడికి వెళ్లారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింటి సందర్శనతో విద్యార్థులను, బడిబయటి చిన్నారులను పాఠశాలకు ఆహ్వానించారు.



మర్పల్లి: పంచలింగాల పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు

సగం మందే హాజరు

మర్పల్లి: వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలకు తొలిరోజు సోమవారం సగంమంది పిల్లలే హాజరయ్యారు. మండలంలో 27 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కస్తూర్బా, ఎస్టీ ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో సుమారు 5 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 2023-2024 విద్యా సంవత్సరం ప్రారంభం రోజున 50 శాతం పిల్లలు మాత్రమే బడికి వచ్చారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం

- తహసీల్దార్ రాంబాబు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పరిగి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ రాంబాబు అన్నారు. ప్రపంచ బాల కార్మికుల దినోత్సవం సందర్భంగా సోమవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు బాలలు తప్పకుండా బడిలో ఉండాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించి, వారికి అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ నరసింహారెడ్డి, స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్, కృష్ణారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.